క్లుప్తంగా

కొనసాగుతున్న మైసమ్మ జాతర



మైసమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కడ్తాల్: మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయ జాతర వైభవంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత ఏర్పాట్లను పర్యవేక్షించారు. భాస్కర్‌నాయక్, అరుణ్ కుమార్, ఆలయ అర్చక సిబ్బంది ఉన్నారు.

‘పట్నం’లో 74.82 శాతం పోలింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గురువారం జరిగిన శాసన సభ ఎన్నికల్లో 74.82శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని 319 పోలింగ్ స్టేషన్లలో 3,27,583 మంది ఓటర్లకు గాను 2,45,105 మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఎన్నిల అధికారి అనంతరెడ్డి తెలిపారు. యాచారం మండలంలో 59 బూత్‌లకు గాను 38,489 మంది, మంచాల మండలంలో 45 బూత్‌లకు గాను 33,997మంది, ఇబ్రహీంపట్నం మండలంలో 76 బూత్‌లకు గాను 56,578 మంది, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 139 బూత్‌లకు గాను 1,16,041 మంది ఓటర్లు ఓటు వేశారు.

మహిళల కోసం ‘సఖి’



జిల్లెలగూడలో సఖీ పోలింగ్ స్టేషన్

మీర్‌పేట: రంగురంగుల బెలూన్‌లు... పచ్చతివాచీ... తోరణాలు.. ఇదేదో శుభకార్యం కోసం ఇంటిని అందంగా ముస్తాబు చేయడం కోసం కాదు. మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం వినూత్నంగా ఏర్పాటు చేసిన సఖీ పోలింగ్ స్టేషన్. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేకంగా సఖీ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఓటింగ్ శాతం పెంచేందుకే ప్రత్యేకంగా తీర్చిదిద్దామని అధికారులు తెలిపారు. ఇక్కడ మహిళా సిబ్బందినే నియమించడం విశేషం.

స్వల్ప లాఠీచార్జి

మంచాల: మంచాల మండలంలోని మంచాల, బండలేమూర్, చిత్తాపూర్ గ్రామాల్లో గురువారం పోలింగ్ కేంద్రాల వద్ద స్వల్ప లాఠీచార్జి జరిగింది. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఉండాలని చెప్పినా రాజకీయ పార్టీల నాయకులు వినిపించుకోలేదు. ప్రజలు కూడా గుమిగూడటంతో వారిని చెదరగొట్టే ప్రయత్నంలో స్వల్ప లాఠీచార్జీ చేశారు. మంచాల సర్పంచ్ జగన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు కరుణాకర్‌రెడ్డికి కూడా దెబ్బలు తగిలాయి.

ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం రూరల్: శాసనసభ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఇబ్రహీంపట్నం మండలం, ఆదిబట్ల మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఓటర్లు బారులు తీరారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 105 నంబర్ పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించింది. గంట పాటు ఆలస్యంగా మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈవిషయమై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల అధికారులతో గొడవపడ్డారు. పోలీసులు వారికి నచ్చజెప్పినప్పటికీ వారు వినకపోవడంతో ఇరు పార్టీల నాయకులపై స్వల్ప లాఠీచార్జి చేశారు. అనంతరం పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించారు. అలాగే రాయపోల్ గ్రామంలోని 164, 165, 167 పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలపై బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేరు కింద సిరా ఇంకుతో అండర్‌లైన్‌లాగా కనిపించాయి. దీంతో ఇదేం పని అని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు వారితో వాగ్వాదానికి దిగారు. పోలీసులు లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. అలాగే నాగన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలింగ్ బూత్ సమీపంలో ప్రచారం నిర్వహిస్తుండగా పోలీసులు గమనించి లాఠీచార్జీ చేశారు. శేరిగూడలో కూడ స్వల్ప లాఠీచార్జీ జరిగింది. ఇబ్రహీంపట్నంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ పర్యవేక్షించారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

హుడాకాంప్లెక్స్: శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థ వారి ఆధ్వర్యంలో సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీలోని వేంకటేశ్వర ఆలయం 39వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీ స్వామి సమక్షంలో వేద పండితులు కృష్ణమాచార్యులు, వంశీధరచార్యులు వేదోచ్ఛరణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు ధనంరెడ్డి, కోశాధికారి రమణ, సభ్యులు వేణుబాబు, సుబ్బారావు, మురళీకొండిన్య తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: ఓటు వేసిన నాయకులు, యువకులు



మాడ్గుల: బారులుదీరిన ఓటర్లు



ఆమనగల్లు: పోలెపల్లిలో క్యూలో ఓటర్లు



ఇబ్రహీంపట్నం: కేవీ తండాలో ఓటువేసిన మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు

పోలింగ్ ప్రశాంతం

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గురువారం ఓటు వేసేందుకు ప్రజలు పోటెత్తారు. కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో చెదురు ముదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రముఖులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌లలో సెల్‌ఫోన్లు, ఓటర్లను తప్ప మరెవరనీ అనుమతించలేదు. చెదురుముదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

– సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సీనియర్ ఐఏఎస్ అధికారి పమేలా



ఇబ్రహీంపట్నం రూరల్: ఓటుహక్కు వినియోగించుకున్న బీఆర్‌ఎస్ నేత క్యామ



తలకొండపల్లి: పోలింగ్ స్టేషన్‌లో క్యూలో నిలుచున్న ఓటర్లు



అబ్దుల్లాపూర్‌మెట్: సిరాగుర్తు చూపిస్తున్న గౌరెల్లి గ్రామస్తులు



మంచాల: పోలింగ్ బూత్ వద్ద బారులుదీరిన జనం



తుర్కయంజాల్: ఇంజాపూర్‌లో టెంట్లు లేకపోవడంతో ఎండలోనే నిల్చున్న ఓటర్లు



ఇబ్రహీంపట్నం: శేరిగూడలో బారులుదీరిన ఓటర్లు



కడ్తాల్: కర్కల్‌పహాడ్‌లో రాత్రి 8 గంటలు దాటినా క్యూలైన్‌లో ఓటర్లు

ముగిసిన సమరం

- బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం
- గెలుపు ధీమాలో ప్రధాన పార్టీల అభ్యర్థులు



స్ట్రాంగ్‌రూమ్‌కి తరలిస్తున్న ఈవీఎంలు

ఇబ్రహీంపట్నం: సార్వత్రిక ఎన్నికల సమరం గురువారం ముగిసింది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో బ్యాలెట్ బాక్స్‌ల్లో అభ్యర్థుల భవితవ్యం దాగివుంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 28 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పోలింగ్ అనంతరం ఈవీఎం, వీవీపాడ్‌లను భారీ బందోబస్తుతో మంగల్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచారు. 3వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగేవరకు స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. ఓటర్లు మూడు ప్రధాన పార్టీల వద్ద డబ్బులు తీసుకున్నప్పటికీ ఎవరికి ఓటేశారో తెలియని పరిస్థితి. ఆయా పార్టీల నాయకులు పోలింగ్ స్టేషన్ల వారీగా ఎవరికి ఎన్ని ఓట్లు పడి ఉండవచ్చునన్న లెక్కలతో తర్జనభర్జన పడుతున్నారు.

గెలుపు ధీమాలో అభ్యర్థులు..

పోలింగ్ సరళిని బేరీజు వేసుకుంటూ విజయం తమదంటే తమదేనని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నాలుగోసారి తాను గెలువడం ఖాయమంటున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. తాను విజయం సాధించినట్లేనని.. డిసెంబర్ 3న ఇబ్రహీంపట్నంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సంబురాలు జరుపుకుందామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హోరాహోరీగా జరిగిన ప్రచార హోరులో అభ్యర్థుల్లో ఎవరో ఒకరు గెలిచి మరొకరు ఓడిపోవడం సహజమే. అయితే ప్రధాన పార్టీల ఇద్దరు అభ్యర్థులు గెలుపు ధీమాతో ఉండటం గమనార్హం.

స్ట్రాంగ్‌రూమ్‌కు తరలిన ఈవీఎంలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికలు ముగిశాయి. బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం దాగి ఉంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 343 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఎన్నికల బ్యాలెట్ బాక్సులు. ఈవీఎం యంత్రాలను పటిష్టమైన బందోబస్తుతో ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి సమీపంలో ఉన్న సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు తరలించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్‌లను భద్రపరిచారు. అవకతవకలకు తావులేకుండా అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్ల ముందే వాటిని సీజ్ చేశారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను సీవీఆర్ కళాశాలలోనే భద్రపరిచారు.

ఆమనగల్లులో ప్రశాంతంగా పోలింగ్



బందోబస్తును పర్యవేక్షిస్తున్న అదనపు డీసీపీ

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్లు మండలంలో గురువారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 35 పోలింగ్ కేంద్రాలుండగా.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను ఉంచారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు యువకులతో పాటు మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఉత్సాహం కనబర్చారు. మొత్తంగా కల్వకుర్తి నియోజకవర్గంలో 83శాతం మేర పోలింగ్ నమోదైనట్లు సమాచారం. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామంలో రాత్రి 7గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్, బీజేపీ అభ్యర్థి ఆచారి సందర్శించారు. అదనపు డీసీపీ నర్సింహారెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

మొరాయించిన ఈవీఎం



పోలింగ్ కేంద్రం వద్ద కూర్చున్న మహిళలు

మాడ్గుల: మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లిలో గురువారం జరిగిన పోలింగ్‌లో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు రెండుగంటల పాటు పోలింగ్ నిలిచిపోయింది. గ్రామంలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవ్వగా.. తొమ్మిదిగంట ప్రాంతంలో ఈవీఎం మొరాయించింది. టెక్నీషియన్లు వచ్చి రెండు గంటలు శ్రమించి ఈవీఎం మెషీన్‌ను బాగు చేశారు. 11 గంటల తర్వాత పోలింగ్ ప్రారంభమైంది

యాచారం మండలంలో..

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. యాచారం, మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో ఉదయం ఈవీఎంలు మొరాయించడంతో కొద్ది సేపు ఓటింగ్ నిలిచిపోయింది. సాంకేతిక సిబ్బంది వచ్చి మరమ్మతులు చేయడంతో మళ్లీ పోలింగ్ కొనసాగింది. నందివనపర్తిలో 32 బూత్‌లో ఈవీఎంలు సక్రమంగా పని చేయకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. టెక్నీషియన్లు వాటిని సరిచేయడంతో ఓటింగ్‌ను పునఃప్రారంభించారు.

‘పట్నం’లో ట్రాఫిక్‌జాం

- పల్లెబాట పట్టిన ఓటర్లు
- ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి 2కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్



ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై ట్రాఫిక్

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్–నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై ఇబ్రహీంపట్నం ప్రధాన చౌరస్తా నుంచి దాదాపు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. గురువారం గ్రామాలకు ఓటువేసేందుకు వెళ్లిన ఓటర్లు తిరిగి నగరానికి పయనమవడంతో ఇబ్రహీంపట్నంలో తీవ్ర ట్రాఫిక్ జాం అయ్యింది. ఉదయం హైదరాబాద్ వైపు ఒకే దారిలో గ్యాప్ లేకుండా కార్లు, బైక్‌లు, ప్రైవేట్ వాహనాలు వెళ్తుండటంతో విపరీతమైన ట్రాఫిక్ నెలకొంది. అంబేడ్కర్ చౌరస్తా వద్ద కనీసం రోడ్డు దాటేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సాగర్ వైపు వెళ్లే రహదారి రద్దీగా ఉంటే... సాయంత్రం 6 గంటల అనంతరం హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డు వాహనాలతో రద్దీగా మారింది. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల టాప్‌లపై కూర్చొని ప్రయాణం చేశారు. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు తీవ్రంగా శ్రమించారు.

ఓటెత్తిన యువత

అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి ఓటువేసేందుకు యువ ఓటర్లు ఆసక్తి చూపారు. క్యూలైన్లు ఉన్నప్పటికీ ఓపికతో ఓటువేసి బాధ్యతను చాటిచెప్పారు. మొదటిసారి ఓటేసిన యువత మనోగతం వారి మాటల్లోనే...

గర్వంగా ఉంది



ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఎంత కీలకమైందో తెలిసింది. ఓటు హక్కు వినియోగించుకోవడం గర్వంగా ఉంది. ప్రజలు తమ హక్కుల కోసం ఎలా పోరాడుతారో.. బాధ్యతను కూడా అంతేలా నిర్వర్తించాలి. సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటుహక్కు వజ్రాయుధం.

– నిఖిత, విద్యార్థిని, హయత్‌నగర్

ఆనందంగా ఉంది

మొదటిసారి ఓటు వేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. నాకు ఓటుహక్కు వచ్చినప్పటి నుంచి ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురుచూశాను. ఉదయాన్నే త్వరగా పోలింగ్ బూత్‌కి వెళ్లి ఓటేశాను. పోలింగ్‌కు అధికారులు చేసిన ఏర్పాట్లు బాగున్నాయి. ఇకనుంచి ప్రతి ఎన్నికల్లో తప్పకుండా ఓటు వేస్తాను. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి.

– సంజన, డిగ్రీ విద్యార్థి, హయత్‌నగర్

రాజ్యాంగానికి హ్యాట్సాఫ్

ఎన్నికల్లో మొదటిసారి ఓటు వేయడం చాలా సంతోషంగా ఉంది. 18 ఏళ్లు దాటిన యువతకు ఓటుహక్కు కల్పించిన రాజ్యాంగానికి హ్యాట్సాఫ్. మన నాయకుడిని మనమే ఎన్నుకునే అవకాశం కల్పించింది. ఓటు వేస్తేనే ప్రశ్నించే హక్కు ఉంటుంది. మొదటిసారి ఓటువేయడం చాలా ఆనందంగా ఉంది. యువత పెద్ద సంఖ్యలో ఓటుహక్కు వనియోగించుకోవాలి.

– సదాఫ్, డిగ్రీ విద్యార్థిని, ఆమనగల్లు

రాజకీయాలపై ఆసక్తి పెరిగింది



ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి. ఓటు వేయ డం ద్వారా రాజకీయాల పట్ల ఆసక్తి పెరిగింది. ఓటు వేసి తమ భవిష్యత్తుకు బంగారు బాట లు వేసుకోవచ్చు. బూత్‌ల వద్ద సదుపాయాలు బాగున్నాయి.

– మణికృష్ణగౌడ్, బీటెక్ విద్యార్థి, హయత్‌నగర్

తెలియని అనుభూతి కలిగింది



నేను డిగ్రీ చదువుతున్నాను. రాజకీయాలంటే ఇంకా పూర్తిగా తెలియవు. తొలిసారి ఓటు వేసేందుకు వెళ్తున్నప్పుడు ఎంతో ఆనందం వేసింది. ఓటువేసి పోలింగ్ బూత్‌లో నుంచి బయటకు వస్తున్నప్పుడు తెలియని అనుభూతిని పొందాను.

– అర్జున్, డిగ్రీ విద్యార్థి, ఇబ్రహీంపట్నం

తొలిసారి ఓటు వేసా



బీటెక్ పూర్తిచేసి ఇటీవల సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. తొలిసారి ఓ టుహక్కు వినియోగించుకున్నాను. రాజ్యాంగం మనకు కల్పించిన ఓటుహక్కు ప్రాధాన్యత తె లిసింది. సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు అనేది ఓ వజ్రాయుధం.

– అభిషేక్, బీటెక్, ఇబ్రహీంపట్నం

విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ!

ఇబ్రహీంపట్నం: గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఒక పక్క పోలింగ్... మరో పక్క డబ్బుల పంపిణీ విచ్చల విడిగా కొనసాగింది. గురువారం జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల అనుచరులు పోలింగ్ ముగిసే సమయం వరకు డబ్బులను పంపిణీ చేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. పోలింగ్ జరుగుతుంటే డబ్బుల పంపిణి చేస్తున్నారని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఒకరిపైఒకరు ఆరోపించుకున్నారు. శేరిగూడ, రాయపోల్, పొల్కంపల్లి, ఇబ్రహీంపట్నంతోపాటు పలు గ్రామాల్లో ఈతంతు విపరీతంగా సాగింది. ఓటుకు వెయ్యి నుంచి పదిహేను వందల వరకు ఇవ్వగా సాయంత్రం వరకు ఓటు వేయని వారికి మరింత డిమాండ్ పెరిగింది. అలాంటి వారిని గుర్తించి వారి ఇళ్లకు రెండు నుంచి రెండున్నర వేల వరకు ముట్టజెప్పి ఓట్లు వేయించుకున్నారు. నగరంలో ఉండే వారికి ప్రత్యేక వాహనాలు సమకూర్చి ఓట్లు వేయించుకున్నారు. శాసనసభ ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ జరగడంపై రాజకీయ విశ్లేషకులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రలోభాలను భవిష్యత్‌లోనైనా అరికట్టాలని కోరుతున్నారు.